# ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును

ప్రొఫెసర్ గౌరాంగ శర్మగారు చాలా విచిత్రమైన వ్యక్తి. నిక్కచ్చి మనిషి. ఆయన నాకు పరిచయమైన పదిరోజుల్లోనే 'ఈయ నంటే ఎవరూ ఇష్టపడరు' అని తెలిసిపోయింది. అంటే ఆయన పూర్తిగా చెడ్డవాడని కాదు. మానవ సంబంధాల పట్ల మృదుత్వం అంగీక రించరు. నవ్వుతూనే పలకరిస్తారు. కానీ, ఆ మాటల మధ్య ఆప్యాయత ఉండదు. వ్యవహార ధోరణి, అదిన్నీ నియమ నిబంధనలకు పూర్తిగా కట్టుబడిన సరళి ఉంటుంది. ఆయన తృప్తిగా నవ్వడం అరుదు. ఆయనతో పనిచేసేవాళ్ళకు ఆయన పక్కుమని నవ్వారంటే అదొక పరమానందం.

ప్రొఫెసర్ శర్మగారితో ఆయన రిటైర్ అయిన తర్వాత పరి చయం కలగడం నా అదృష్టమే. ఆయన సర్వీస్‌లో ఉండగా మిట్ట మధ్యాహ్నం సూర్యుడిలాగా ఉండేవారట. ఆయనకు కోపం వచ్చినా, ప్రసన్నత కలిగినా కూడా అందుకు గురి అయిన వ్యక్తిని ఉక్కిరి బిక్కిరి చేస్తారని ఆయన గూర్చి తెలిసినవాళ్ళు చెప్పుకున్నారు. నేను అప్పుడే నా పి హెచ్.డి. థీసిస్ సమర్పించి అమాయకంగా అవకాశం కోసం ఎదురు చూస్తున్నవాణ్ణి. ఆయనకు నలుగురు కూతుళ్ళు, మధ్యలో కొడుకు అని విన్నాను.

ఆయనతో పరిచయం అయిన వేళావిశేషం ఎటువంటిదో కానీ, నేనంటే ఆయనకేమిటో ఆపేక్ష కలిగినట్లు నాకనిపించేది. నిజాని కాయన్ను చాలామంది అపార్థం చేసుకున్నారు కానీ, ఆయన ఎంత మంచివారో, ముక్కుసూటిగా పోయే వ్యక్తో, కల్మషం లేని మనిషో;

డబ్బు కోసం, అధికారం కోసం, మాట చలాయింపు కోసం యావలేని మనిషో ఇట్టే కనిపెట్టవచ్చు. శర్మగారు ఎవరి పట్లా సద్భావం, ఆదరణ, ఆప్యాయత చూపేవారుకారు. కానీ, ఇతరులను అకారణంగా, అనవసరంగా దూషించేవారుకారు. మానవ సహజమైన దౌర్బల్యాలను, లోభాలను ఆయన తీవ్రంగా విమర్శించేవారుకారు. 'ఇంత మంచివారు కదా ప్రొఫెసర్ శర్మగారు, ఆయనంటే ఎందుకు చాలామందికి సదభిప్రాయం లేకపోవడం, భయంతో కూడిన అయిష్టం?!' అని నాకర్థమయ్యేది కాదు. బహుశా ఆయనకు నా పట్ల ఎందుకో చాలా అభిమానం కలిగింది కాబట్టి నాకూ ఆయన పట్ల ప్రత్యేకమైన ఇష్టం కలుగుతున్నదేమో చెప్పలేను. ప్రాజెక్టు డైరెక్టర్‌గారు చీటికి మాటికి నన్ను పిలుస్తూంటే, కూచోవయ్యా అని ఆ విషయం, ఈ విషయం చర్చిస్తూ ఉంటే, సాయంకాలం ఇంటికి వెళ్ళేప్పుడు నా భుజం మీదనో లేదా చేతిలోనో ఆయన చేయి వేసి నడుస్తూ ఉంటే నాకెంతో మురిపెంగా ఉండేది. నాతోపాటు పరిగెత్తి లేదా నన్ను పరిగెత్తిస్తూ ఒకటి రెండు సార్లు సిటీ బస్ ఎక్కారు అలాగ ఆయన ఉత్సాహం చూపిస్తుంటే నాకెంతో సంతోషంగా ఉండేది. మేము సమవయస్కులం అనేట్లుగా ఆయన నాతో ప్రవర్తించేవారు. నిజానికి ఆయనెక్కడ, నేనెక్కడ? ఏదైనా ప్రాజెక్టు విషయం సంకోచంగానే, బిడియంగానే నేను సూచిస్తే 'అవునవును, ఆల్‌రైట్' అని నన్ను ప్రోత్సాహపరచేవారు.

ఆయనకు నామీద అభిమానం ఎంత దూరం పోయిందంటే "ఏమోయ్ విశ్వనాథం, నీలాంటి మంచి కుర్రాడుంటే చూడరాదూ - మా చిన్నమ్మాయి నీల పెళ్ళికి ఉంది" అన్నారు ఓ రోజున. నిజం చెప్పొద్దూ - నాక్కాస్త గిలిగింతలు పెట్టినట్లయింది. 'అరే, ఎలాటి ఛాన్సు పోగొట్టుకున్నానురా బాబూ' అనిపించింది. నాకు అంత క్రితం ఏడాది పెళ్ళయిపోయింది. మా ఆవిడంటే నాకు ఇష్టమే. ఇంతకూ ఆ నీలను ఇదివరకు నేను చూడలేదు. ఇకముందు చూసే అవకాశం

కూడా లేదని ఒక నెల రోజుల్లోనే తేలిపోయింది. ఆ అమ్మాయి ఎమ్. టెక్. చేస్తూ ఒక మాంచి కాశ్మీర్ కుర్రాడితో అమెరికా వెళ్ళిపోయింది-పెళ్ళి చేసుకొనేలెండి. పెళ్ళికి మాస్టారు కూడా వెళ్ళారు. ప్రొఫెసర్ గారు నేనంటే ఇంత అభిమానంగా ఉంటారు కదా - ఆయన ఇల్లాలిని పిలిపించి నన్ను పరిచయం చెయ్యరేం అనిపించేది. ఇంటికి వెళ్ళినప్పుడల్లా కనిపించేవారు. నేను నమస్కారం పెట్టేవాణ్ణి. ఆమె అందుకొనేవారో లేదో నేను గమనించేవాణ్ణి కాను. ఆయన తన అనుభవాలూ, జ్ఞాపకాలూ ఏకరువు పెడుతున్నప్పుడు చాలా తక్కువ సార్లు ఆమె ప్రసక్తి తెచ్చేవారు. మెచ్చుకోలుమాట ఎప్పుడోకాని ఉండేది కాదు.

'జలకాలుష్యం నివారణోపాయాలు, వాటి నిర్వహణ పద్ధతులు' అనే అంశం లోతుగా పరిశీలించి ఒక నివేదిక తయారుచేయాల్సిందిగా ప్రభుత్వం ఆయన్ను నియమించింది. ఆయన చార్జీ పుచ్చుకొన్న ఆరు నెలల తర్వాత నన్ను కూడా తమ ఉద్యోగ బృందంలోకి తీసుకొన్నారు. కానీ, ముందొచ్చిన చెవులకంటే వెనక వచ్చిన కొమ్ములు వాడిలాంటివాడు వీడు అని తక్కిన ఉద్యోగులు చెవులు కొరుక్కున్నా ప్రొఫెసర్ గారు తనతోపాటే నన్ను పని చెయ్యమన్నారు కాబట్టి ఇతరుల మాటలు నేను ఖాతరు చేయాల్సిన పని లేకపోయింది.

శాంపిల్స్ తీసుకొని రావడానికీ, లేబరేటరీల విశ్లేషణలకూ ప్రొఫెసర్‌గారు నన్నే పంపిస్తూ ఉండేవారు. దీనివల్ల నాలుగు రూకలు అదనంగా కూడా నాకు దొరికే అవకాశం ఉంది కాబట్టే, ఇతర ఉద్యోగులకు కష్టంగా ఉండడంలో తప్పేమీ లేదు. ఇలా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రొఫెసర్ గారి ఉద్యోగ నియమిత కాలం ఇక్కడ ముగిసిపోయినా ఆయన ఇక్కడే ఉండిపోవడానికి నిర్ణయించుకున్నారు.

ఆయనుంటున్న ఆ చిన్న ఇల్లునే కొనుక్కున్నారు. అయితే, రెణ్ణెల్లకో, మూణ్ణెల్లకో ఆయన యూనివర్శిటీలకూ, ప్రభుత్వ సంఘాల పనిమీదా పదేసి రోజులు ప్రయాణాలు చేస్తూ ఉండేవారు. సరిగ్గా ఆ సమయాలకు నేను వెళ్ళడం తటస్థిస్తే లోకంలోని సంగతులు తమ సహజ ఆక్షేపణ ధోరణిలో వినిపించేవారు. ప్రాజెక్టు పని పూర్తి అయిన తర్వాత నేను కాలేజీలో ఉద్యోగం దొరకడంవల్ల చేరిపోయాను. ఏ ఆర్నెల్లకో, ఏడాదికో ప్రొఫెసర్‌గారిని పలకరిస్తూ ఉండేవాడిని.

ఆ తర్వాత ఒకసారి ఒక పెద్ద మనిషి గౌరాంగశర్మ గారి ద్వారా ఒక ఉపకారాన్ని ఆశించి, ఆ పని నేను తప్ప ఎవరూ చేయించ లేరని నాకు లేఖ రాయడం ఆశ్చర్యం కలిగించింది. శర్మగారికి అరవై ఏళ్ళు పైబడ్డ తర్వాత పరిచయం అయిన వాణ్ణి నేను. ఎవరికో ఏదో ఉపకారం చేయాల్సిందని నేనాయనకు సిఫార్సు చేయగలనా? చేస్తే బాగుంటుందా? ఆయన కోపగించుకొని పరుషంగా మాట్లాడితే నా పని ఏంగాను? అయితే, ఆ లేఖ రాసిన పెద్దమనిషి నాకు బాగా కావలసినవాడే. ఆయన మాట కూడా నేను తోసివేయలేను. ఇంతకూ అది సామాన్యమైన సిఫార్సు కూడా కాదు. ఒక పరీక్షా అభ్యర్థికి మార్కులు వేయించాలి. అదీ గౌరాంగశర్మగారి దగ్గరనా? అది జరిగే పనేనా! పుట్టి మునిగిపోయే ప్రమాదం ఏం వచ్చిందయ్యా అంటే గౌరాంగశర్మగారు ఆ అభ్యర్థికి ఏభై మార్కులు పైన ఇవ్వకపోతే కొంప మునిగిపోతుంది. ఆ విద్యార్థి భవిష్యత్తు అంతా అస్తవ్యస్తమై పోతుంది. అసలు శర్మగారి దగ్గరకు ఆ పేపరు ఎందుకు వచ్చిందంటే, అంతకు ముందు ఆ పేపరు దిద్దిన ఇద్దరు పరీక్షకులు వేసిన మార్కులలో విపరీతమైన వ్యత్యాసం ఉంది. ఒకరు నలభై వేస్తే, ఇంకొకరు అరవై ఇచ్చారన్న మాట. అట్లా ఎక్కువ వ్యత్యాసం వచ్చినప్పుడు తుది పరిష్కారంగా మూడో ఎగ్జామినరుకు పంపుతారు. ఇక ఆయన మాటే ఖరారవుతుంది. ఇటువంటి చిక్కు వచ్చిపడింది. శర్మగారు ఎవరి

మాటా వినరని, ఆయన దగ్గర చూచాయగా ఆ మాట తేవడానికి అందరూ భయపడతారని, నేను ఆయనతో అంటే-ఆయన వింటారని తనకెవరో బాగా నమ్మకస్తులు చెప్పారని, కనక ఈ లేఖ వ్రాస్తున్నానని ఆ పెద్ద మనిషే- ఆయనా ప్రొఫెసరే- నన్ను ఇంచుమించు ప్రాధేయ పడుతూ ఉత్తరం రాశారు.

సరే, ఏమయితేకానీ. ఒకవేళ ఆయన నన్ను తీవ్రంగా మంద లిస్తారు- అంతేకదా అనుకొని మెల్లిగా, చాలా భయపడుతూ, నెమ్మదిగా అసలు విషయం బయటపెట్టాను. 'మీతో నాకుండే చనువును ఈవిధంగా దుర్వినియోగపరచడానికి చాలా బాధపడుతున్నాను మాస్టారూ!' అని ఎంతో అనునయంగా విన్నవించుకున్నాను. ఆయన కోప్పడలేదు. ప్రశాంతంగా నవ్వారు. 'సరే, సరే, చూడనీ నన్ను. పృష్ఠం కింద చేయేసి పైకి నెడతాను. ఎంతవరకు పైకి పాకుతాడో చూద్దాం: అంతే కానీ, ఎత్తి ఎగరేయలేను' అన్నారు. ఆమాత్రం చాలు. నాకు కొండెక్కి-నంత సంబరమైంది. నాకు ఈ పని పురమాయించిన పెద్దమనిషి రెండో లేఖ కూడా రాశారు. కానీ, నేనాయనకు సమాధానం రాయలేదు. తర్వాత నెల రోజులకు ఆయనే మళ్ళీ నన్నభినందిస్తూ ఇంకో లేఖ రాశారు.

మరి మాష్టారు చాలా కఠినుడనీ, ఎవరి మాటా వినడనీ, ఎవరూ ఆయన దగ్గరకు చేరడానికి వీలులేదని, కోపిష్టి అనీ ముద్ర పడడానికి కారణం ఏమిటో నాకు అర్థమయ్యేది కాదు.

ఒకరోజున దురదృష్టకరమైన సన్నివేశం ఎదురైంది నాకు ప్రొఫెసర్ గారిని చూడడానికి వాళ్ళింటికి వెళ్ళేసరికి. ఆయన నన్ను చూడకపోయినట్లయితే గిరుక్కున వెనక్కు తిరిగి వచ్చేసేవాణ్ణి. ప్రొఫెసర్‌గారి భార్య ఖిన్నురాలై వెర్రికళ్ళతో చూస్తూ ఉంది. కన్నీటి చారికలు తుడుచుకోలేదు కూడా. గేటు తీసి లోపలికి అడుగుపెట్టి నేను

గతుక్కుమన్నాను. ఒక్కసారి ప్రొఫెసర్‌గారు ఇంత చిన్నవారై పోయారేమిటి? ఇంచుమించు ఆయన బట్టతల నిగనిగలాడుతూ ఒత్తుగా, నల్ల జుట్టుతో ఎలా మార్పు చెందింది? అనుకుంటూ ఉండగానే ప్రొఫెసర్‌గారు లోపలి వాకిలి నుంచి వరండాలో అడుగుపెట్టి నన్ను చీదరించుకుంటున్నట్లు చూశారు.

ఇంతవరకు ఎప్పుడూ నేను అటువంటి చూపులకు గురికాలేదు. "విశ్వనాథం, ఇప్పుడు నేను పనిలో ఉన్నాను. తర్వాత రావోయ్!" అని కట్టె విరిచేసినట్లు, మొహమాటం లేకుండా చెప్పేశారు. నే నిందాక గేటు తీయగానే మొదట చూసి ప్రొఫెసర్ గారని భ్రమపడిన వ్యక్తి ఆయనగారి కొడుకని తెలిసిపోయింది. ప్రొఫెసర్ గారు ఆ మాట చెప్పగానే నేను వెంటనే వెనక్కు తిరిగి రావచ్చునా! అలా చేయలేదు. వెర్రిగా నాలుగు నిమిషాలు అక్కడే నిలబడిపోయాను. వెళ్ళవేం అన్నట్లు ప్రొఫెసర్ గారు నావేపు చూసినా, నాలో చైతన్యం కలగ లేదు. ప్రొఫెసర్‌గారి ఇల్లాలినీ, ఇంతకుముందు నాకు పరిచయం లేని ఆ కొత్త వ్యక్తినీ చూస్తుండిపోయాను. గౌరాంగశర్మగారు ఒక కవరేదో ఆ కొత్త వ్యక్తి చేతిలోపెట్టి "ఇక దయచెయ్, ఇక ఈ జన్మలో నాకు నీ ముఖం చూపించవద్దు. నీకూ నాకూ ఇక ఎటువంటి సంబంధమూ లేదు" అని స్పష్టంగా ఎటువంటి ఉద్వేగమూ లేకుండా నిర్వికారంగా చెప్పారు. "నేను మారిపోయానని చెపుతున్నా నమ్మరా నాన్నగారూ?" అంటున్నాడతను. "నేను నీకు నాన్నను కానురా! కాబట్టి నీవు నాకు కొడుకువి కానట్లేకదా. ఇక వెళ్ళవచ్చు"నని కూరల మనిషికో, పాల మనిషికో పాత బాకీ చెల్లించి పోవచ్చునని చెప్పినంత తాపీగా చెప్పారు ఆయన. అప్పుడిక నాలో చలనం కలిగింది. వెనక్కు తిరిగి వచ్చేశాను.

మళ్ళీ చాలా రోజులదాకా ప్రొఫెసర్ గారిని చూడలేకపోయాను. ఇంచుమించు ఒక సంవత్సరం గడిచిందేమో! ఎప్పుడు వెళ్ళి ఆయన్ను

చూద్దామన్నా ఏదో సంకోచం మదిలో మెదలి ఆనాటి దృశ్యం కళ్ళ ముందు స్పష్టంగా కదలాడేది. ప్రొఫెసర్ గారి కొడుకు చాలా చక్కగా- అందంగా ఉన్నాడు. మనిషిలో దుర్లక్షణాలేమీ కనపడలేదు. ప్రొఫెసర్ గారే ఒకసారి చెప్పారు - తనమీద కోపం వచ్చి ఒకసారి వాళ్ళబ్బాయి తన పుస్తకం ఏదో ఎత్తుకొని బజార్లో అమ్మేశాడట. అప్పుడు కాబోలు మా మోహన్ అన్నారు. ఎక్కడుంటాడండీ, ఏం చేస్తున్నాడని నేను అడిగితే ఆయన అప్పట్లో మారు పలకలేదు. ఆ కుర్రాడి పేరు మోహనసుందరం అని నాకు తర్వాత తెలిసింది. ప్రొఫెసర్ గౌరాంగశర్మగారి కుటుంబ జీవితంలో ఏవో ఒడిదుడుకులున్నాయని చూచాయగా తెలిసినా వాటిని వివరంగా తెలుసుకోవాలన్న కుతూహలం నాకు కలగలేదు.

ఒంటరిగా ఉన్న సమయంలో ప్రొఫెసర్‌గారెప్పుడైనా జ్ఞాపకం వస్తే నాకు జాలి కలిగేది. అంత మంచివారికి, అంత నిక్కచ్చిగా పోయే వ్యక్తికి ఎందుకిలాంటి ఇబ్బందులు కలిగాయా? అనిపించేది.

యూనివర్శిటీలో ఒక సెమినార్‌లో ప్రొఫెసర్ గారితో పని చేసిన ఆయన పాత స్నేహితుడొకరు కనిపించారు. ఆయన పేరు రామస్వామి గారు. ఆయన నన్ను చూసి ఆప్యాయంగా పలకరించి "గౌరాంగశర్మగారు గాంధీ హాస్పిటల్‌లో చేరిన సంగతి తెలియదా?" అని అడిగారు. నేను చాలా బాధపడ్డాను. ''నేనీమధ్య వారిని చూసి ఓ ఏడాదైంది'' అని నొచ్చుకున్నాను. "అవును. ఆయన కూడా అదే అన్నారు. మీరు సెమినార్‌లో కనబడతారనీ, తన సంగతి చెప్పాల్సిందనీ, ఓసారి వచ్చి చూసి పొమ్మన్నారని చెప్పండి అని కూడా అన్నారు శర్మగారు. సుమారు రెండు నెలలు కావస్తోందట ఆయన గాంధీ హాస్పిటల్‌లో చేరి కూడా. స్ట్రోక్ అని భయపడ్డారట కానీ, అది కొద్దిలో తప్పిపోయిందట. మూత్రకోశ సంబంధమైన వ్యాధి.

ఆయనకు పిల్లలు తన అంచనాలకు, ఆశలకు తగినట్లు ప్రవర్తించలేదని పెద్ద బాధ" అన్నారు రామస్వామి గారు. ఎవరైనా వచ్చి ఇప్పుడాయన దగ్గర ఉన్నారాండీ అని అడిగాను. "ఎవరూ లేరు. ఎవరూ రారు. ఎందుకంటే కొడుకు తప్ప ఈ దేశంలో ఇప్పుడెవరూ లేరు. ఆ కొడుకు ఈయన దగ్గరకు రాడు. వస్తే ఈయన సహించడు" అన్నారు రామస్వామిగారు. నలుగురు కూతుళ్ళలో ఒక్కరూ ఇక్కడ లేరా అన్నాను. "అవును లేరు. అదే ఆయనబాధ. పోనీవాళ్ళైనా సుఖపడుతుంటే ఈయన కింత బాధ లేకపోను. వాళ్ళ సంసారాలు కూడా అంత ఫక్తుగా లేవు భర్తనొదిలేసిన వాళ్ళు, భార్యనొదిలేసిన వాళ్ళు ఆయన పిల్లలు. ఆయనకు చాలా నిజాయితీపరుణ్ణనీ, ముక్కుకు సూటిగా పోయేవాణ్ణనీ, ఒక్క రూపాయి అక్రమ సంపాదన సహించననీ గర్రాగా ఉండేది. అవన్నీ నిజమే. కానీ, పట్టు విడుపులు లేకపోతే కుటుంబంలోనైనా, ప్రపంచంలోనైనా కష్టం" అన్నారు రామస్వామి గారు. ప్రొఫెసర్‌గారిం గురించి ఇంకా ఎటువంటి అప్రియాలు వినవలసి వస్తుందోనని నమస్కారం చేసి, రేపు ఆదివారం వెళతాలెండి అని ఆయన దగ్గర సెలవు తీసుకున్నాను.

ప్రొఫెసర్ గౌరాంగ శర్మగారిని చూడడానికి వెళ్ళడం నా మనసుకేమిటో చాలా భారమనిపించింది. ఆయన పరిస్థితి ఎలా ఉన్నదో, ఆయన్ను ఎలా పలకరించాలి? ఏ విధంగా ఓదార్పు మాటలు చెప్పాలి? అని ఎంతో గుంజాటన పడ్డాను. కానీ, శర్మగారు చాలా ప్రశాంతంగా, నిరుద్వేగంగా నన్ను పలకరించారు. ఆమెగారు లేరు. ఏరీ ఆమె అని అంటే చాలా నిర్లిప్తంగా "సాయంకాలం భోజనం తీసుకొని ఏ ఏడింటికో వస్తుంది. మధ్యాహ్నం పనివాడు భోజనం తెస్తాడు" అని చెప్పారు.

"ఇంకో పదిరోజుల్లో డిశ్చార్జి అవుతాను. అవునోయ్ విశ్వనాథం, నీకు పిల్లలా" అని అడిగారు. ఈ మధ్యనే అబ్బాయి పుట్టాడండీ, వాడికి ఆరు నెలలు మొన్ననే వెళ్ళాయి అని చెప్పాను. "పిల్లలను ఎక్కువగా గారాబం చేసి నెత్తికెక్కించుకోకూడదోయ్. వాళ్లూ చెడిపోతారు, మననీ అప్రతిష్ఠ పాలుచేస్తారు. ఇంగ్లీషులో ఓ సామెత ఉంది - నీకు తెలుసో లేదో - 'స్పేర్ ది రాడ్ స్పాయిల్ ది చైల్డ్' అని. నా విషయంలో అలాగే జరిగింది. వాళ్లకు అతి స్వతంత్రం ఇచ్చానేమో అనిపిస్తున్నది" అన్నారు వైరాగ్యంగా.

మీ అబ్బాయి వచ్చారా అన్నాను ధైర్యం చేసి. "వాడెందుకు వస్తాడూ? వాడు రాడు. వాడికీ నాకూ ఎప్పుడో తెగతెంపులైనాయి" అన్నారు.

"మీరే ఆ రోజున వెళ్ళగొట్టారు కదా?"

"అది మొదటిసారి అనుకున్నావా? అది ఏ ముప్పైమూడోసారో!"

"అలాటి పరిస్థితి రావడానికి కారణం ఏమంటారు?"

"నీకు చెప్పినా తెలీదు. నేను చాలా ఓర్పు చూపించాను. ఎంతో ఆశ పడ్డాను. కొందరి జీవితాలలో ఇలాటి సంఘటనలు తప్పవేమో! సరే పోనీయ్. ఇప్పుడా విషయాలెందుకు? పిల్లల్ని పెంచడం కూడా ఒక నేర్పు, ఒక కళ కావచ్చు. మనం ఎన్నో అనుకుంటాం. అవి అలా జరగకపోవచ్చు."

"కానీ, మన బాధ్యత కూడా కొంత ఉంటుంది కదా మాస్టారూ! ఆ రోజున మీరు మీ అబ్బాయిని ఆదరించి ఉన్నట్లయితే క్రమంగా అతను తన తప్పులు తెలుసుకొని ఉండేవాడేమో? మీరా అవకాశం ఇవ్వకనేపోతిరి."

"నువ్వు పొరపడుతున్నావు విశ్వనాథం! ఇంట్లో పది రోజులు నెమ్మదిగా ఉన్నట్లే ఉండి ఏదో విలువైన వస్తువును ఎత్తుకొనిపోతాడు. ఇట్లా చెప్పాలంటే తండ్రినైన నాకు ఎంత కష్టంగా ఉంటుందో ఆలోచించుకో. పైన ఇంకొక బాధ కూడా వచ్చిపడింది నాకు. తల్లి వాడి తప్పులన్నిటికీ దోహదం చేస్తుంది. అసలు వాడట్లా పాడై పోవటానికి తల్లే కారణం. నేను సరిదిద్దబోయినప్పుడల్లా ఆవిడ ఏడ్చి, మొత్తుకొని రాద్ధాంతం చేసేది."

"అది సహజం కదా మాస్టారూ! తల్లి తప్పులు చూడదు, తండ్రి ఒప్పులు ఎన్నడు అని పెద్దవాళ్ళంటారు కదా? పోనీ పూర్తిగా అతని బాధ్యత మీరు ఆమెకే అప్పచెప్పాల్సి ఉండెను."

"ఆఁ - అదీ చూశాను. ఇంతకూ ఇలా ఎందుకు జరుగుతుందో మనకు తెలీదు. నేను విధిని ఒప్పుకొనే మనిషిని కానని నీకు తెలుసు. మన విధి మనం సక్రమంగా నిర్వహించడంలోనే ఏదో లోపం ఉంటుందని నా నమ్మకం. పోనీ, మగపిల్లవాణ్ణి నేను జాగ్రత్తగా పెంచలేదనుకుందాం. ఆడపిల్లల విషయంలో ఆమె చేసిన నిర్వాకం ఏముంది? వాళ్ల మాటలకు వంత పాడడం తప్ప 'నాన్న అలా ఎందుకు చెబుతున్నారో కాస్త ఆలోచించండి' అని వాళ్ల మనసును, ధ్యాసను, అభిమానాన్ని నా వైపుకు తిప్పలేదు. విరోధులు కనుక ఎట్లా ప్రవర్తిస్తారో అట్లా ప్రవర్తించారు నా పట్ల."

నేనేం మాట్లాడగలను! ఆడపిల్లల గురించి వివరాలడగడం అదొక సున్నితమైన విషయం. శర్మగారే మళ్ళీ మొదలెట్టారు. "సావిత్రికి చిలక్కి చెప్పినట్లు చెప్పాను. కులం, గోత్రంబట్టి కాదు నేను చెప్పడం. వాతావరణం, అభిరుచులు, విలువలు కూడా ఆలోచించాలి.

ఆ కుర్రాడు నాకు తెలుసు. నీవు అతణ్ణి చేసుకుంటే వివాహం సుఖ ప్రదం కాదు అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. తల్లి సపోర్టు చేయక పోతే ఏమైనా ఆలోచించేదేమో! కానీ, ఆ పరిస్థితుల్లో నింపాదిగా ఆలో చించడం కష్టం నీవీ పెళ్ళి చేసుకొనేట్లయితే నా ప్రమేయం ఏమీ ఉండ దని చెప్పాను. కానీ, మా పెద్దమ్మాయి నా మాట వినలేదు. ఏ రెండేళ్లో వాళ్ళు కాపురం చేశారు. అతణ్ణి వాళ్ళ కులంలోని పిల్లనే చేసుకుంటే పెద్ద కట్నం వచ్చేది అని బాధించారు. నా పేరు చెప్పుకొని కాళ్ళా వేళ్ళాపడి ప్రైవేట్ కంపెనీలో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నది. నేనేం చేయగలను? దానికో కూతురు. ఆ ఊళ్లో ఉండగా తల్లి వెళ్ళి మూడు రోజులూ, నాలుగు రోజులూ ఉండి వచ్చేది.

ఇక రెండోపిల్ల-వాళ్లొట్టి డబ్బు మనుషులు, వాళ్ళతో కాపురం చేయనంటుంది. ఈవిణ్ణి బాగా చదివించాను. లక్ష్మి అంటే నాకు చాలా గారాబం. లక్ష్మి పుట్టిన రోజునే నేను ప్రొఫెసర్ నైనాను. నాకు ఆ పిల్ల అంటే పంచప్రాణాలు. ఇలా అంటే తక్కిన పిల్లలపై ప్రేమ ఉండదని కాదు. అందరిపైనా సమానంగానే ప్రేమ ఉంటుంది. కానీ, ఏ పిల్ల ఎక్కువ బాధపడుతుందో, కావాలని కష్టాలు కొనితెచ్చుకుం టుందో ఆ పిల్లపైన ఎక్కువ ప్రేమ అని చెప్పుకోవాలనిపిస్తుంది. డాక్టరైంది. చాలా అనువైన సంబంధం కదా అని పెళ్ళి చేశాను. ఆ అల్లుడొక భ్రష్టుడని తర్వాత తెలిసింది. ఏం చెయ్యాలి? పెద్ద ఆఫీస రుద్యోగమే ఏడుస్తున్నాడు చెప్పుకోవడానికి. పైసాపైసా లెక్క అడుగు తాడట. రోజూ డబ్బు తెమ్మంటాడట. నాకు చెప్పలేదు లక్ష్మి. అవేవో పరీక్షలు రాసింది. అమెరికా వెళ్ళిపోయింది. అందుకు నేను బాధపడ లేదు. సావిత్రిని కూడా తీసుకొనిపోయింది. నేను బతికున్నానని చూస్తున్నది కానీ, మా ఆవిడకు ఆ కూతుళ్ళ దగ్గరకు ఎప్పుడెప్పుడు పోవాలా అని ఉంది.

ఇక మూడోది ఉన్నది గదా నీల. దానిపైన నేను ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఆ పిల్ల దగ్గరే ఉండిపోవాలనుకున్నాను. ఆ పిల్ల పేరున ఏభై వేలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో కూడా భద్రపరిచాను. అది ఆలోచించి ఉంటుంది. అబ్బా, అమ్మా ఇద్దరూ ఘర్షణపడి చేసిన పెళ్ళిళ్ళు ఇట్లా తెల్లవారాయి కదా, నేను నా సొంతంగా నిర్ణయం తీసుకుంటే తప్పేముంది? మద్రాసులో ఐ.ఐ.టి. లో చదివించాను. నిత్యానంద కౌల్, నీలాశర్మ ఇద్దరూ పెళ్ళాడుతున్నారు. మీరు సుముహూర్తానికి వచ్చి ఆశీర్వదించవలసిందని ఏకంగా మాకు శుభలేఖ పంపింది. వెళ్ళక తప్పుతుందా! నేను వెళ్ళవద్దనే అనుకున్నాను. కానీ, మా ఆవిడ ఒకటే పోరు. నేను రాకపోయినా తాను వెళ్ళి తీరతానంది.

ఇది నా కథ విశ్వనాథం. మూడో అల్లుడు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మేధావిట. పెళ్ళైన నెల లోపునే వాళ్ళు కూడా అమెరికా వెళ్ళిపోయారు. ఇంకో అమ్మాయి సంగతి చెప్పలేదు నీకు. కళ. దానికి చిన్నప్పుడు పోలియో వచ్చింది. కాలు కాస్త అవుడు. కట్నం బాగానే ఇచ్చి ఒక బంధువులబ్బాయికే ఇచ్చాను. ముగ్గురు పిల్లలు. భర్తకు కలెక్టరాఫీసులో గుమాస్తా ఉద్యోగం. నేనక్కడకు వెళ్ళి ఉండగలనా? ఆడపిల్ల ఇంట్లో ఉంటే బాగుంటుందా? నా ఖర్చుకు నేను డబ్బిస్తాను అంటే వాళ్ళు ఒప్పుకుంటారా?

ఇక, నా కొడుకు గురించి నేను చాలా ఆరాటపడ్డాను. పదేళ్ళ వయసు నుంచే వాడికీ, నాకూ దార్లు వేరైపోయినాయి. ఊరంతా వెతికే వాణ్ణి. మా సుందరం కనపడ్డాడా? మా సుందరం వచ్చాడా మీ ఇంటికి అని. చదువు అబ్బలేదు. చెడు సావాసాలు ఎక్కువైనాయి. నేను పెద్ద ప్రొఫెసరును. నా కొడుకు కాలేజీలో కూడా అడుగు పెట్టలేకపోతే ఎంత అవమానం! చావగొట్టి నా చేతులు విరిగిపోయ్యేవి. కానీ, వాడిలో ఎటువంటి మార్పూ రాలేదు. వాడి మీద ప్రేమతో ఇంటికి రాగానే తల్లి

వాడికి అన్నం పెట్టేది. డబ్బులిచ్చేది.వాడుచేసిన అప్పులు నా మర్యాద నిలుపుకోవడానికి నేను తీర్చాల్సి వచ్చేది.

పద్దెనిమిదేళ్ళు వచ్చినా మెట్రిక్యులేషన్ అయినా కాలేదు. నామీద చాలా కసి పెంచుకున్నాడు. ఖాతరు చేసేవాడు కాదు. పోనీ, అట్లా అయినా బాగుపడతాడేమోనని విశాఖపట్నంలో ఒక స్నేహితుడి దగ్గర ఉంచాను. కలకత్తాలో మేము చదువుకునే టప్పుడు వెంకట్రావు నా స్నేహితుడు. పోనీ నేను చెపితే వినడు, నన్ను చూస్తే రెచ్చిపోతాడు. వెంకట్రావైనా సుందరాన్ని దారిలో పెడతాడేమోనని ఆశ పడ్డాను. వెంకట్రావు కూడా నన్ను వంచన చేశాడు. ఆర్నెల్లో, ఏడాదో అయిన తర్వాతనైనా నాతో అసలు విషయాలు చెప్పాలా, వద్దా? గుంభనంగా దాచేశాడు. నాకు అపకారం చేసే ఉద్దేశం లేకపోవచ్చునేమో కానీ, అదొక వినోదమా! గౌరాంగ వాళ్ళబ్బాయిని నా దగ్గర ఉంచితే వాడు మా వంటమనిషితో సావాసం కట్టాడని తేలిగ్గా పరీక్షా సమావేశాల్లో ఆ ప్రొఫెసర్ దగ్గరా ఈ ప్రొఫెసర్ దగ్గరా ప్రచారం చేశాడు వెంకట్రావు. ఏం చూసి వీడికి పెళ్ళి చేయాలి? నా హోదా, సంపాదన చూసి ఎవరైనా పిల్లనివ్వడానికి ముందుకు రావచ్చు కానీ, సుందరానికి పెళ్ళి చేస్తే ఆ పిల్లను కష్టాలు పెట్టడమే కదా! ఆమె వైపు బంధువు లెవరో తీసుకొని వెళ్ళారు సుందరాన్ని. మళ్ళీ ఆ తర్వాత ఆరు సంవత్సరాల వరకూ నాకు కనపడలేదు."

పొద్దు వాలిపోయింది. ఆస్పత్రి ఆవరణలో అంతా లైట్లు వెలిగాయి. పావురాలు కువకువలాడుతూ ఆస్పత్రి ఎత్తయిన పూర్వ కాలపు మందిరపు కప్పుల్లో సర్దుకుంటున్నాయి. 'నేను వెళ్ళొస్తాను మాస్టారూ!' అన్నాను. 'వచ్చే సోమవారం నేను ఇంటికి వెళ్ళిపోతాను. ఆ తర్వాత ఎప్పుడైనా రావయ్యా! నీకు పిహెచ్.డి. వచ్చిందని రామస్వామిగారే కాబోలు చెప్పారు. చాలా సంతోషం. ఇక వెళ్ళిరా.

ఏడు కావస్తోంది' అన్నారు ప్రొఫెసర్ గారు. ఇంతలో వర్ధనమ్మ గారు క్యారియర్ తీసికొని లోపల అడుగు పెట్టారు. ఆమె చాలా అలసటతో దీనంగా ఉన్నారు. నన్ను గుర్తు పట్టినట్లు లేదు. వెంటనే గుర్తుపట్టగల దగ్గరతనంకూడ లేదుకదా! నేను విశ్వనాథాన్ని అని, మాస్టారి దగ్గర పనిచేశానని చెప్పుకున్నాను. ఆమె అనాసక్తంగా తన పనిలో నిమగ్నమైపోయారు.

నేను వచ్చేశాను. అంతసేపు నాతో ప్రొఫెసర్ గౌరాంగ శర్మ గారు కుటుంబ విషయాలు ప్రస్తావించడం అదే మొదటిసారీ, చివరిసారీ కూడా అనుకుంటాను. ఆ తర్వాత రెండోసారి హాస్పిటల్‌కు వెళ్ళి వారిని చూడలేదు. ఆర్నెల్లు అయినా ఇంటికి వెళ్ళి కూడా చూడలేదు. ఏవో పనులతో కొంతా ఉత్సాహం లేక కొంతా వారిని చూడడానికి వీలైంది కాదు. కాలేజీలో కొత్త సంవత్సరం పిల్లల్ని చేర్చుకోవడం, ఆ సంబంధమైన ఒత్తిడులలో ఒక వ్యక్తి నా దగ్గరకు వచ్చి తాను గౌరాంగ శర్మగారి మేనల్లుణ్ణనీ, అబ్బాయిని కాలేజీలో చేర్చడానికి నా సాయం కావాలనీ తనను తాను పరిచయంచేసుకున్నాడు. ఆ కుర్రాడి మార్కులు అందుకు సరిపోయేలాగా లేవు. కష్టసాధ్యం అయినా, ప్రయత్నిస్తానని చెబుతూ, మాస్టారి ఆరోగ్యం ఎలా ఉంది? అన్నాను. గౌరాంగ శర్మగారు తనతో మాట్లాడరనీ, ఆ వీధిలో వెళుతూ ఆయన్ను చూశాననీ, ఆరోగ్యం అంత బాగాలేదనీ, అత్త ఈమధ్య అమెరికా వెళ్ళి మొన్ననే వచ్చిందనీ ఆయన చెప్పాడు. మీరు వెళ్ళి చూడదలిస్తే త్వరగా వెళ్ళి చూడండి. ఏమంటే,ఈయన్ను కూడా వాళ్ళు అమెరికా తీసుకొని వెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నారు అని కూడా చెప్పాడతడు.

ఆ తర్వాత ఆదివారం శారదా నగర్ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. మాస్టారు బాగా నీరసించిపోయారు. ఆయన ఒక్కరే ఇంట్లో ఉండడం చాలా ఆశ్చర్యం కలిగించింది. ఒట్టి చాపమీద కేవలం దిండు మాత్రం

తలకి ఆధారంగా ఆయన కిందనే పడుకుని ఉన్నారు. నన్ను చూసి అతి ప్రయత్నంమీద లేచికూచున్నారు.

"ఆమె ఎక్కడికి వెళ్ళారు? మీరు ఒక్కరే ఉన్నారేం?" అని అడిగాను.

దీర్ఘంగా శ్వాస పీలుస్తూ "ఇక నేను ఒంటరిగా ఉండాల్సిందే. ఇప్పుడు నా మాట పట్టించుకొనే వాళ్ళు లేరు. వెనకటి కసీ, కోపమూ అంతా ఇప్పుడు నామీద అందరూ తీర్చుకుంటున్నారు. ఇప్పుడు నేను కదలలేను, మెదలలేను, చెయ్యేత్తలేను. అందువల్ల పిలిచినా వినపడ నట్లు నటించినా చేసేదేమీ లేదు. త్వరగా వెళ్ళిపోవడం మంచిదని తోస్తూ ఉంది" అన్నారు.

"అంతమాట ఎందుకండీ మాస్టారూ? ఇప్పుడు మీకేం లోటు? మళ్ళీ పూర్తిగా మీకు ఆరోగ్యం కలుగుతుంది"లాంటి ధైర్యం చెప్పే మాటలు చెప్పాను. ఆయన వికారంగా, కృత్రిమంగా నవ్వుతూ "ఏం బావుకోను ఇంకా బతికి? నాకేం విచారం లేదు చావాలంటే. బతకాలని ఆశా లేదు. హాయిగా వెళ్ళిపోతేనే నాకూ, నావాళ్ళకూ కూడా సుఖం. ఏమంటే, నా ఇంట్లో నేను ప్రబల శత్రువును.అన్నిరకాలా అసహ్యించు కోబడుతున్నవాణ్ణి. నామీద వాళ్ళకుండే అసహ్యాన్ని వడ్డీతో కూడా తీర్చుకుంటున్నారు" అన్నారు.

ఆయన ఇల్లాలును గురించే ఇలా మాట్లాడుతున్నారని తెలుస్తూనే ఉంది. దగ్గరదగ్గర డెబ్బైఏళ్ళు వస్తున్నాయాయనకు. ఐదుగురు బిడ్డల తండ్రి. పెద్ద ఉద్యోగం చేశారు.నిప్పులాంటి మనిషి అనిపించుకున్నారు. కానీ, పరిస్థితి ఇప్పుడీవిధంగా ఉంది. ఇంతకంటే జీవితంలో దైన్యం ఏముంటుంది?

"ఇలా మిమ్మల్ని వదిలి వారు ఎక్కడకు వెళ్ళారు?"

"నేను అందరికీ చాలా బరువైపోయాను. మనిషి జీవితంలో తన వాళ్ళనుకొన్నవాళ్ళ నిరాదరణ కంటే, ద్వేషం కంటే మించిన

నరకం ఏముందయ్యా విశ్వనాథం? ఇంకా నయం - నన్ను ఈడ్చి పారెయ్యడానికి అన్ని ఏర్పాట్లు చేసుకొన్నాను, లేకపోతే వీధిపాలై పోయేవాణ్ణి."

ఆయన మనసుకి గొప్ప ఆఘాతం ఏదో తగిలింది. దాన్ని ఆర్చ గలవారూ, తీర్చగలవారూ ఎవరూ లేరు- ఆయన ఇల్లాలు, పిల్లలూ తప్ప. కానీ, వాళ్ళను ఆయనే దూరం చేసుకున్నారు. నేను సెలవు తీసుకొని వచ్చేస్తుండగా గ్యాస్ సిలిండర్ అదనంగా ఎవరో ఇప్పిస్తా మంటే ఆమె వెళ్ళారని చెప్పారు. అయ్యో, నాకు కబురు చేస్తే నేను కనుక్కొనేవాణ్ణి కదా అని చాలా నొచ్చుకుంటూ అన్నాను.

ఆ తర్వాత త్రివేండ్రంలో ఒక సెమినార్‌కు వెళ్ళిరావడంలో వారం రోజులు గడిచిపోయింది. ప్రొఫెసర్‌గారి మేనల్లుడు అప్పటికి మూడురోజుల నుంచీ తిరిగి పోతున్నాడట. అవాళ కాలేజీలో కనపడి తన కొడుకు సీటు గురించి అడుగుతూ విషాదకరమైన వార్త చెప్పాడు - ప్రొఫెసర్‌గారు పోయారని. తనకు ఎలాటి మరణానంతర కార్యకలాపాలు జరపకూడదనీ, శరీరాన్ని వైద్య ప్రయోగం నిమిత్తం ఇవ్వాల్సిందనీ రాశారట. ఆ మేనల్లుడు చెప్పారు - ఆయన జీవిత కాలంలో ప్రేమగా, అభిమానంగా ఎవరితోనూ వ్యవహరించలేదనీ, తల్లిని నానా విధాల కష్టాల పాలు చేశారనీ! అంత మంచివారు అలా ప్రవర్తించారంటే నేను నమ్మలేకపోయాను. షాక్ తిన్నంత పనైంది.

ఇక ఆయనతో నాకు ఎలాంటి సంబంధం ప్రత్యక్షంగా స్మరించు కొనే అవకాశం లేదు కదా! ఓసారి ఆమెను చూడాలని వెళ్ళాను.

కనీసం ఆయన చిట్టచివరి కోరికనైనా ఆ తల్లీ, కొడుకు తీర్చి నట్లు కనపడదు. ఆయన్ను ఇప్పుడు ఎంతగానో ప్రేమిస్తున్నట్లు, ఎటు వంటి అవరోధాలు లేకుండా తమ సొంత మనిషి అనుకున్నట్లు వారు ఆయన్ను స్మరిస్తున్నారు!

(ఇండియాటుడే - 1991)